భారతి సిమెంట్‌తో నిర్మాణాలు వేగవంతం



మన్సూరాబాద్: భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా జరుగుతుందని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్‌సాహెర్ తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ కమాన్ వద్ద భాగ్యలక్ష్మి స్టీల్ ట్రేడర్స్‌లో గురువారం రాత్రి తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తున్నామని, స్లాబ్ సమయాల్లో భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని వివరించారు. అనంతరం సుమారు 45 మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత వాహనాలను ఉపయోగించుకోండి

-డైరెక్టర్ శైలజ

చాదర్‌ఘాట్: నిరాశ్రయులు, నిరాదరణకు గురైన వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్‌జెండర్స్, అనారోగ్యానికి గురై ప్రయాణం చేయలేని పరిస్థితిలో ఉన్న వారు చేయూత వాహనాలను వినియోగించుకోవాలని రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా మలక్‌పేటలో తన కార్యాలయంలో మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా ఏడీకి గానీ, పీడబ్ల్యూడీ హెల్ప్‌లైన్‌కు గాని ఫోన్ నంబర్ 155326కి ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

నియామకం



కొప్పుల దినేష్‌కుమార్

మలక్‌పేట: బీజేపీ మూసారంబాగ్ డివిజన్ పూర్తిస్థాయి కమిటీని అధ్యక్షుడు కొప్పుల దినేష్‌కుమార్ గురువారం ప్రకటించారు. అధ్యక్షునిగా కొప్పుల దినేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా రంజిత్‌కుమార్, శ్రీలత, చందు, శ్రీధర్‌గౌడ్, సంతోష్, జనరల్ సెక్రటరీలుగా పరుశరామ్ నాయక్, విశాల్, సెక్రటరీలుగా గాయత్రి, సురేష్, యాదగిరి, వెంకట్‌రెడ్డి, ట్రెజరరీగా రమాదేవితో పాటు 10 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారు. ఈ కమిటీ 2025–27 వరకు రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు. పార్టీ విధానాలకు అనుగుణంగా పని చేస్తూ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.

మూసారంబాగ్‌లో పర్యటించిన జడ్‌సీ



జోనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ వెంకన్న గురువారం అధికారులతో కలిసి మూసారంబాగ్ డివిజన్‌లో పర్యటించారు. వర్షాకాలం నేపథ్యంలో పాత భవనాల్లో (క్వార్టర్స్) నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గురువారం ఈస్ట్ ప్రశాంత్‌నగర్ వడ్డెర బస్తీ, సలీంనగర్ రత్నంబస్తీ క్వార్టర్స్‌ను పరిశీలించినట్లు సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పలు సమస్యలు జడ్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల నిర్మాణం, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, నాలాలో పూడిక తదితర సమస్యలను ఆయనకు వివరించగా పరిష్కరిస్తానని ఆయన చెప్పారని కార్పొరేటర్ తెలిపారు. పర్యటనలో డీసీ జయంత్, టీపీ సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ గుండప్ప తదితరులు ఉన్నారు.

అరుణాచలానికి స్పెషల్ బస్‌లు

చైతన్యపురి: తమిళనాడులోని అరుణాచలానికి దిల్‌సుఖ్‌నగర్ -2 డిపో నుంచి స్పెషల్ బస్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. వచ్చే నెల 9న రాత్రి 7 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుండి బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 11వ తేదీన మధ్యాహ్నం అక్కడ బయలుదేరి 12న సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఒకొక్కరికి టికెట్ రూ. 3900 ఉంటుందని అడ్వాన్స్ బుకింగ్ కోసం టీజీఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారా కానీ, దగ్గరలో ఉన్న ఏటీబి ఏజంట్ వద్ద కానీ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959444165, 9666350995, 7382838010 నంబర్లలో సంప్రదించవచ్చు.

వర్షాకాలం.. పొంచివున్న ప్రమాదం



వనస్థలిపురం సుష్మ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ సమీపంలో జాతీయ రహదారిపై కల్వర్టు

- ఏళ్లుగా కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు
- ఇంకా అసంపూర్తిగానే కల్వర్టులు, వరద కాలువల నిర్మాణం
- భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి అగమ్యగోచరం



చింతలకుంట సమీపంలో..

వనస్థలిపురం: ఓ వైపు కొనసాగుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు.. మరో వైపు ఇంకా పూర్తికాని కల్వర్టులు, వరద కాలువలు, క్యాచ్‌పిట్‌ల నిర్మాణం... ఇక వర్షాకాలం మొదలు కావడంతో నాలాలు ఎక్కడున్నాయో, గుంతలు ఎక్కడున్నాయో, రోడ్డు మార్జిన్ ఎక్కడుందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది వర్షాకాలంలో వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద వరద ప్రవాహంలో రోడ్డు మార్జిన్ తెలియక రెండు కార్లు రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లడమే ఇందుకు నిదర్శనం.

రెండేళ్లకు పైగా సా...గుతున్న రోడ్డు విస్తరణ పనులు

ఎల్‌బీనగర్ చింతలకుంట నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు చేపట్టిన విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు రెండేళ్లకు పైగా సాగుతున్నాయి. ప్రధాన రహదారి పనులు చాలావరకు పూర్తయినప్పటికీ రోడ్డు పక్కగా వరదనీటి కాలువలు, కల్వర్టులు, వాటిపై కప్పు, క్యాచ్‌పిట్‌ల నిర్మాణం ఇంకా అసంపూర్తిగానే ఉంది. వరద కాలువలకు సరైన అవుట్‌లెట్లు లేకపోవడం, భారీ వర్షాలు వచ్చినప్పుడు ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద, రోడ్డుపై పారే నీటితో రోడ్డు మార్జిన్, పక్కనే ఉన్న నాలాలు, కల్వర్టులు కనిపించని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో వర్షాకాలం వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఆగస్టు 15న భారీ వర్షం కురిసిన సమయంలో వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద రోడ్డు మార్జిన్ తెలియక కారు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లింది. అలాగే 16న మరో కారు పనామా చౌరస్తా సమీపంలోని కల్వర్టులోకి దూసుకెళ్లగా అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు వారిని కాపాడారు. ఈ ఏడాది కూడా పనులు ఇంకా అసంపూర్తిగానే ఉండడంతో వాహనదారులకు ప్రమాదం పొంచివుంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, సంబంధిత అధికారులు వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని కల్వర్టుల నిర్మాణం, దానిపై కప్పు, జంక్షన్ల వద్ద క్యాచ్‌పిట్‌ల పనులు, వరదనీరు సాఫీగా వెళ్లేలా అవుట్‌లెట్లు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నగదు కాజేశారంటూ నాటకం.. పీఎస్‌లో ఫిర్యాదు

నలుగురు అరెస్ట్..
రూ.28.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, వెనుక భాగంలో పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

నాగోలు: ప్లాట్ కొనుగోలు కోసం పంపిన డబ్బును దొంగలు కాజేశారని స్నేహితుడిని మోసం చేసిన కేసులో నలుగురు వ్యక్తులను బాలాపూర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.28.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ జకీర్ తన కుమారుడు ఇలియాస్ సూచన ప్రకారం నగర శివారులో ప్లాట్ కొనుగోలు చేయాలనుకున్నారు. జకీర్ తన అల్లుడు కబీర్‌కు డబ్బు పంపాలనుకున్నాడు. కానీ కబీర్ హైదరాబాద్‌లో లేనందున జకీర్ కుమారుడు ఇలియాస్ స్నేహితుడు ఎర్రకుంట నివాసి అయిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌కి అప్పగించాలని చెప్పాడు. కానీ ఆ డబ్బును కాజేయాలని ఖాదర్ ప్లాన్ వేశాడు. ఖాదర్ మామ ముంతాజ్ భాగ్‌కు చెందిన హబీద్ హరూన్, చాంద్రాయణగుట్ట నివాసి వర్ధన్, కాటేదాన్, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రసికాంత్ బర్ధన్ ఆలియస్ కిట్టు, మరో వ్యక్తి రషీద్ ఖాన్‌లకు డబ్బు విషయం చెప్పారు. దొంగిలించిన డబ్బులో బర్ధన్, రషీద్ ఖాన్‌లకు రూ. 20 వేలు ఇస్తామని ఒప్పుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 21న రాత్రిపూట ఇలియాస్ అబ్దుల్ ఖాదర్‌కు రూ. 29 లక్షలు ఇచ్చాడు. దీంతో ఖాదర్ వేసుకున్న ప్లాన్ ప్రకారం తన ముఠా సభ్యులకు గూగుల్ లోకేషన్ పంపించారు. దీంతో వారు ఎర్రకుంటలోని టోటల్ గ్యాస్ సమీపంలో ఖాదర్‌పై కర్రతో దాడి చేసి రూ. 29 లక్షలు తీసుకుని ద్విచక్ర వాహనాలపై పారిపోయారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

అనంతరం దొంగిలించిన డబ్బును ఖాదర్‌కు అప్పగించాడు. అతను హబీబ్ హరూన్, వర్ధన్, రసికాంత్ బర్ధన్, రషీద్ ఖాన్‌లకు రూ. ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున ఇచ్చి రెండు రోజుల తర్వాత మిగిలిన మొత్తాన్ని ఇస్తానని హామీ ఇచ్చి ఎర్రకుంటలోని తన ఇంట్లో డబ్బులు ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు కాజేశారని ఇలియాస్‌కు తెలిపాడు. దీంతో బాధితుడు బాలాపూర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి నేరానికి పాల్పడిన అబ్దుల్ ఖాదర్, హబీద్ హరూన్, వర్ధన్, రసికాంత్ బర్ధన్‌లను గురువారం అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 28. 50 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నలుగురిని రిమాండ్‌కు తరలించారు. ఈకేసులో రషీద్ ఖాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీత్‌రెడ్డి, ఏసీపీ, సీఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని పార్కులను అభివృద్ధి చేస్తాం



బీఎన్‌రెడ్డినగర్‌లో థీమ్ పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎస్‌ఈ అశోక్‌రెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో అసంపూర్తి పార్కులను త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని రూ.1.99 కోట్లతో చేపట్టిన పార్కు పనులను జోనల్ ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, ఈఈ రమేష్‌బాబులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొంతమేర పార్కు పనులు జరిగి ఆగిపోయాయని పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పార్కు ఉమెన్ థీమ్ పార్కు అని అన్ని హంగులతో అభివృద్ధి చేసి త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీఈ దామోదర్‌రావు ,ఏఈ రాజ్‌కుమార్, జలమండలి డిప్యూటీ మేనేజర్ రాజగోపాల్, మేనేజర్ భవ్యారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రావు, నాయకులు, కాలనీవాసులు పంపన వెంకటేశ్వరావు, ప్రవీణ్, వర్ధని, వాణి, శరత్‌కుమార్, తరుణంశర్మ, జైపాల్‌రెడ్డి, పవన్‌రెడ్డి, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోరా..?

- కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి
- చార్మినార్ జోనల్ కార్యాలయం వద్ద బీజేపీ భారీ ధర్నా



జెడ్‌సీ కార్యాలయం ముందు బైఠాయించిన కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న అవినీతి అధికారులకు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు సైతం వత్తాసు పలకడం శోచనీయమని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌సదన్ సింగరేణి కాలనీలో రహదారి వేయకుండానే బిల్లు సొమ్మును అధికారులు, కాంట్రాక్టర్ తమ జేబుల్లో వేసుకున్న విషయాన్ని పూర్తి ఆధారాలు, వివరాలతో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి 6 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు సంబంధిత అధికారులపై కానీ, కాంట్రాక్టర్‌పై కానీ చర్యలు తీసుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు.ఈ మేరకు గురువారం ఐఎస్ సదన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పూల్‌బాగ్‌లోని చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి కార్పొరేటర్ శ్వేతమధుకర్ రెడ్డి జెడ్‌సీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అవినీతి అధికారులు, కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోకుంటే కమిషనర్ కార్యాలయం వద్ద నిరసనకు దిగుతామని తెలిపారు. నిరసనలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బి.భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు నిరంజన్ యాదవ్, సహదేవ్ యాదవ్, జంగం మధుకర్‌రెడ్డి, వీరేంద్రబాబు యాదవ్, లింగాల హరిగౌడ్ పాల్గొన్నారు.

నేడు నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ





హయత్‌నగర్: వర్ధనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, గణపతి పూజ, హోమాలు, ఆవాహన, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమంగా, శుక్రవారం ఉదయం 7:06 నిమిషాలకు మిథున లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో మహాయంత్ర సహితంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించనున్నామని, కార్యక్రమం అనంతరం మహా అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తదితరులు హాజరుకానున్నారని వర్ధనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 31వ తేదీ, వచ్చే నెల 1వ తేదీ ఒగ్గు కళాకారులతో అమ్మవారి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చాదర్‌ఘాట్: తాగునీరు.. రోడ్డుపాలు శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి వాటర్ వర్క్స్ అధికారులు స్పందించారు. ఓల్డ్ మలక్‌పేట డివిజన్ పోచమ్మ దేవాలయం వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీరు వృథాగా రహదారులపై పారుతోందని వచ్చిన కథనంతో గురువారం అధికారులు మరమ్మతులు చేయించారు.

గురుకులాల సెక్రటరీని సస్పెండ్ చేయాలి

తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మలక్‌పేట: దళిత విద్యార్థులను అవమానపరిచిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని తక్షణమే సస్పెండ్ చేయాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ డిమాండ్ చేశారు. దళిత విద్యార్థుల పట్ల ఆమె చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మూసారంబాగ్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల చేత పనులు చేయించడమే కాకుండా టాయిలెట్స్ క్లీన్ చేయించడం తగదన్నారు. 'దళిత పిల్లలు ఏమైనా పాష్ సొసైటీ నుంచి వచ్చారా.. వారేమైనా భోగభాగ్యాలతో జీవిస్తున్నారా?' అని హేళనగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అట్టడుగు వర్గాల పట్ల ఈ దేశంలో వివక్షత కొనసాగుతోందని అనడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శమన్నారు. ప్రభుత్వం ఆమెను బాధ్యతల నుంచి తొలగించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిపాక ప్రభాకర్, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యారా సతీష్, గ్రేటర్ నాయకులు పవన్, సునీల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజంలో భాగస్వాములవ్వాలి



చికెన్ షాప్ నిర్వాహకులకు సభ్యత్వం అందచేస్తున్న కృష్ణ యాదవ్

చంపాపేట: ప్లాస్టిక్ కవర్లు వద్దు..టిఫిన్ బాక్సులే ముద్దు అని చంపాపేట డివిజన్ చికెన్ షాపుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ అన్నారు. గురువారం చంపాపేటలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కస్టమర్లు టిఫిన్ బాక్సులు తెచ్చుకునేలా అలవాటు చేయాలని, ప్లాస్టిక్ కవర్లు ఇవ్వద్దని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజంలో చికెన్ షాప్ నిర్వాహకులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం స్నేహ, ఎస్ఎన్‌రెడ్డి చికెన్ షాప్ నిర్వాహకులకు సభ్యత్వం అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఖాదర్, బాలరాజ్‌నాయక్, వేణుచౌదరి, గణేష్, రాజవర్ధన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, యాదగిరిరావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్ల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి, సర్కిల్ అధికారులు

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం డివిజన్ పరిధిలో మారుతీ నగర్, శుభోదయ తదితర కాలనీలలో రూ 1.17 కోట్ల జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్లను సర్కిల్ అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ గోపాలరావు, రాజు, వాటర్ వర్క్స్ మేనేజరు రమ్యభారతి, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్, కాలనీల సంక్షేమ సంఘ ప్రతినిధులు రమేష్, శ్రీనివాసరెడ్డి, నవీన్, రఘునందన్‌రెడ్డి, శివకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు సమాజ శ్రేయస్సు కోరాలి



లఘు చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

వనస్థలిపురం: సమాజానికి ఉపయోగపడే చిత్రాలు రావల్సిన అవసరం ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. దాశరథి థియేటర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం సహకారంతో వనస్థలి ఫిల్మ్ సొసైటీ వనస్థలిపురం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయ కల్యాణ మండపంలో ప్రదర్శించిన లఘుచిత్రాల ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్బీ శ్రీరాం దర్శకత్వం వహించిన పసుపు కుంకుమ, కిరణ్ దగాని దర్శకత్వం వహించిన ఆదిపరాశక్తి, శశాంక్ దర్శకత్వం వహించిన మధుర గానం, అజయ్ తీగలపల్లి దర్శకత్వం వహించిన అబల అనే లఘు చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో దాశరథి ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వినయ్‌కుమార్, డా.మారంరాజు రామచంద్రరావు, సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి, ఎస్.భుజంగరెడ్డి, పి.పద్మారెడ్డి, మధు రాయుడు, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.